"మధురమైన పిల్లలూ - మీరు రాయల్ కులము యొక్క రాయల్ విద్యార్థులు, మీ నడవడిక చాలా రాయల్ గా ఉండాలి, అప్పుడే తండ్రిని ప్రత్యక్షం చేయగలుగుతారు"

ప్రశ్న:- వినాశన సమయంలోని అంతిమ పేపరులో ఎవరు పాస్ అవుతారు? దాని కొరకు పురుషార్థమేమిటి?

జవాబు:- ఎవరికైతే తండ్రి తప్ప పాత ప్రపంచము యొక్క ఏ వస్తువు గుర్తుకు రాదో, వారే అంతిమ పేపరులో పాస్ అవ్వగలుగుతారు. గుర్తుకొచ్చినట్లయితే ఫెయిల్ అయిపోతారు. దీని కొరకు అనంతమైన ప్రపంచమంతటి నుండి మమకారం తొలగిపోవాలి. భాయి-భాయి (పరస్పరం సోదరులము) అనే పక్కా అవస్థ ఉండాలి. దేహాభిమానం తెగిపోయి ఉండాలి.

ఓం శాంతి. పిల్లలకు ఎల్లప్పుడూ ఈ నషా ఉండాలి - మేము ఎంతటి రాయల్ విద్యార్థులము. అనంతమైన యజమాని మనల్ని చదివిస్తున్నారు. మీరు ఎంత ఉన్నతమైన కులానికి చెందిన రాయల్ విద్యార్థులు, మరి రాయల్ విద్యార్థి యొక్క నడవడిక కూడా రాయల్ గా ఉండాలి, అప్పుడే తండ్రిని ప్రత్యక్షం చేయగలుగుతారు. మీరు శ్రీమతమనుసారంగా విశ్వంలో శాంతిని స్థాపన చేసేందుకు నిమిత్తులయ్యారు. మీకు శాంతి బహుమతి లభిస్తుంది. అది కూడా ఒక్క జన్మకు కాదు, జన్మ-జన్మాంతరాలకు లభిస్తుంది. పిల్లలు తండ్రికి కృతజ్ఞతలు ఏం చెప్తారు! తండ్రి తమంతట తామే వచ్చి అరచేతిలో స్వర్గాన్ని ఇస్తారు. తండ్రి వచ్చి ఇది ఇస్తారు అని పిల్లలకేమైనా తెలుసా. ఇప్పుడు తండ్రి అంటారు - మధురమైన పిల్లలూ, నన్ను స్మృతి చేయండి. స్మృతి కోసం ఎందుకు చెప్తారు? ఎందుకంటే ఈ స్మృతి ద్వారానే వికర్మలు వినాశనమవ్వనున్నాయి. అనంతమైన తండ్రి యొక్క పరిచయం లభించింది మరియు నిశ్చయం ఏర్పడింది. ఇందులో కష్టమనేదేమీ లేదు. భక్తి మార్గములో బాబా-బాబా అని పిలుస్తూ ఉంటారు. తప్పకుండా తండ్రి నుండి ఏదో వారసత్వం లభిస్తుంది. మీకు పురుషార్థం కోసం అవకాశము కూడా ఉంది. ఎంతగా శ్రీమతమనుసారంగా పురుషార్థం చేస్తారో, అంతటి ఉన్నత పదవి లభిస్తుంది. తండ్రి, టీచరు, సద్గురువు - ముగ్గురి శ్రీమతము లభిస్తుంది. ఆ మతము అనుసారంగా నడవాలి. ఉండడము కూడా మీ ఇళ్ళలోనే ఉండాలి. మతముపై నడవడంలోనే విఘ్నాలు కలుగుతాయి. మాయ యొక్క మొదటి విఘ్నమే దేహాభిమానము. స్వయాన్ని ఆత్మగా భావించండి అని తండ్రి అంటారు. మరి శ్రీమతాన్ని ఎందుకు పాటించడం లేదు? పిల్లలు అంటారు, మేము ప్రయత్నమైతే చేస్తాము కానీ మాయ చేయనివ్వడం లేదు. ఈ చదువులో విశేషమైన పురుషార్థం తప్పకుండా కావాలి అని పిల్లలు అర్థం చేసుకుంటారు. మంచి పిల్లలు ఎవరైతే ఉన్నారో వారిని ఫాలో చేయాలి. మేము తండ్రి నుండి ఉన్నతమైన వారసత్వాన్ని తీసుకోవాలి అని అందరూ ఈ పురుషార్థాన్నే చేస్తారు. ముళ్ళ నుండి పుష్పాలుగా తయారయ్యేందుకు స్మృతి చాలా అవసరము. 5 వికారాల అనే ముళ్ళు తొలగిపోతే పుష్పాలుగా అయిపోతారు. అవి యోగబలముతో తొలగుతాయి. చాలామంది పిల్లలు ఏమనుకుంటారంటే, ఫలానావారు ఇలా వెళ్ళిపోయారు కదా, బహుశా మేము కూడా వెళ్ళిపోతామేమో. కానీ వారిని చూసి మరి పురుషార్థం చేయాలి కదా. శరీరాన్ని విడిచిపెట్టేటప్పుడు బాబా స్మృతి ఉండాలి, వశీకరణ మంత్రం గుర్తుండాలి. ఒక్క తండ్రి తప్ప ఇంకేమీ గుర్తుండకూడదు, అప్పుడు తనువు నుండి ప్రాణాలు పోవాలి. బాబా, ఇక మేము మీ వద్దకు వచ్చేస్తున్నాము. ఈ విధంగా బాబాను స్మృతి చేయడం ద్వారా ఆత్మలో ఏ చెత్త అయితే నిండి ఉంటుందో, అదంతా భస్మమైపోతుంది. ఆత్మలో ఉన్నట్లయితే శరీరంలో కూడా ఉందని అంటారు. జన్మ-జన్మాంతరాల చెత్త ఉంది, అదంతా భస్మమైపోవాలి. ఎప్పుడైతే మీ చెత్త అంతా కాలిపోతుందో, అప్పుడు ప్రపంచం కూడా శుభ్రమవుతుంది. మీ కొరకు ప్రపంచం నుండి మొత్తం చెత్త అంతా తొలగిపోవాలి. మీరు కేవలం మీ చెత్తను మాత్రమే శుభ్రం చేయడం కాదు, అందరి చెత్తను శుభ్రం చేయాలి. బాబాను పిలవడమే - మీరు వచ్చి ఈ ప్రపంచం నుండి చెత్తను శుభ్రం చేయండి, మొత్తం విశ్వమంతటినీ పవిత్రంగా చేయండి అని పిలుస్తారు. ఎవరి కొరకు? ఆ పవిత్ర ప్రపంచంలోకి మొట్టమొదట పిల్లలైన మీరే రాజ్యం చేయడానికి వస్తారు. కావున తండ్రి మీ కొరకు మీ దేశంలోకి వచ్చారు.

భక్తి మరియు జ్ఞానములో ఎంతో తేడా ఉంది. భక్తికి సంబంధించి ఎంత మంచి-మంచి గీతాలను పాడుతారు. కానీ అవి ఎవరి కళ్యాణమూ చేయవు. కళ్యాణమనేది - తమ స్వధర్మములో స్థితులవ్వడంలో మరియు తండ్రి స్మృతి చేయడంలోనే ఉంది. మీరు స్మృతి చేయడమనేది లైట్ హౌస్ తిరగడము వంటిది. స్వదర్శనాన్నే లైట్ హౌస్ అని అంటారు. బాప్ దాదా నుండి మాకు స్వర్గ వారసత్వం లభించనున్నదని పిల్లలైన మీరు మనసులో భావిస్తారు. ఇది ఉన్నదే నరుని నుండి నారాయణునిగా తయారయ్యే సత్యనారాయణుని కథ. తండ్రి అర్థం చేయిస్తారు, మీ ఆత్మ ఏదైతే

తమోప్రధానంగా అయ్యిందో, అది సతోప్రధానంగా అవ్వాలి. సత్యయుగంలో సతోప్రధానులుగా ఉండేవారు, ఇప్పుడు మళ్ళీ సతోప్రధానులుగా తయారుచేయడానికి తండ్రి వచ్చారు. తండ్రి అంటారు, నన్ను స్మృతి చేయడం ద్వారానే మీరు సతోప్రధానులుగా అవుతారు. తండ్రియే గీతను వినిపించారు. ఇప్పుడైతే మనుష్యులు వినిపిస్తారు, ఎంత తేడా వచ్చేసింది. భగవంతుడు భగవంతుడే, వారే మనుష్యుల నుండి దేవతలుగా తయారుచేస్తారు. కొత్త ప్రపంచములో పవిత్రమైన దేవతలే ఉంటారు. అనంతమైన తండ్రి కొత్త ప్రపంచం యొక్క వారసత్వాన్ని ఇస్తారు. తండ్రిని స్మృతి చేస్తూ ఉన్నట్లయితే అంతిమ స్మృతిని బట్టి గతి ఏర్పడుతుంది. తండ్రి సంగమయుగములో పురుషోత్తములుగా తయారుచేయడానికి వస్తారని మీకు తెలుసు. ఇప్పుడు ఈ 84 జన్మల చక్రం పూర్తవుతుంది, మళ్ళీ ప్రారంభమవుతుంది. ఈ సంతోషము కూడా ఉండాలి. ప్రదర్శనీలోకి మనుష్యులు ఎవరైతే వస్తారో, వారిని కూడా మొదట శివబాబా చిత్రం ముందుకు తీసుకువచ్చి నిలబెట్టండి. తండ్రి అంటారు, నన్ను స్మృతి చేయడం ద్వారా మీరు ఈ విధంగా అవుతారు. ఫాదర్ ద్వారా లభించే వారసత్వము సత్యయుగము. భారత్ సత్యయుగముగా ఉండేది, ఇప్పుడు అలా లేదు, మళ్ళీ తయారవ్వనున్నది, అందుకే తండ్రిని మరియు రాజ్యాధికారాన్ని స్మృతి చేసినట్లయితే అంతిమ స్మృతిని బట్టి గతి ఏర్పడుతుంది. వీరు సత్యమైన తండ్రి, వీరి పిల్లలుగా అవ్వడం ద్వారా మీరు సత్యఖండానికి యజమానులుగా అవుతారు. మొట్టమొదట అల్ఫ్ (భగవంతుడు) గురించి పక్కా చేయించండి. అల్ఫ్ అంటే బాబా, బే అంటే రాజ్యాధికారము. తండ్రిని స్మృతి చేసినట్లయితే, ఆ స్మృతి ద్వారానే వికర్మలు వినాశనమవుతాయి మరియు మీరు స్వర్గములోకి వెళ్ళిపోతారు. ఇది ఎంత సహజము. జన్మ-జన్మాంతరాలు భక్తి విషయాలను వింటూ-వింటూ బుద్ధికి మాయ యొక్క తాళం పడిపోయింది. తండ్రి వచ్చి తాళం చెవితో తాళాన్ని తెరుస్తారు. ఈ సమయములో అందరి చెవులు మూసి ఉన్నట్లుగా ఉన్నాయి. రాతిబుద్ధి కలవారిగా ఉన్నారు. మీరు వ్రాస్తారు కూడా - శివబాబా గుర్తున్నారా? స్వర్గ వారసత్వము గుర్తుందా? రాజ్యాధికారాన్ని స్మృతి చేయడం ద్వారా నోరు తీపి అవుతుంది కదా. తండ్రి అంటారు, నేను పిల్లలైన మీకు ఎంత ఉపకారం చేస్తాను. మీరైతే అపకారమే చేస్తూ వచ్చారు. అది కూడా డ్రామాలో రచింపబడి ఉంది, ఇందులో ఎవ్వరి దోషమూ లేదు. పిల్లలైన మీ ఈ మిషన్ - రాతిబుద్ధి కలవారిని పారసబుద్ధి కలవారిగా మరియు ముళ్ళను పుష్పాలుగా తయారుచేయడానికే ఉంది. మీ ఈ మిషన్ నడుస్తూ ఉంది. అందరూ ఒకరినొకరు ముళ్ళ నుండి పుష్పాలుగా తయారుచేస్తున్నారు. అందరినీ ఆ విధంగా తయారుచేసేవారు తప్పకుండా కింగ్ ఫ్లవర్ అయ్యి ఉంటారు. స్వర్గ స్థాపనను చేసేవారు మరియు పుష్పాల తోటను తయారుచేసేవారు తండ్రి ఒక్కరే. మీరు ఈశ్వరీయ సేవాధారులు. తమోప్రధానులను సతోప్రధానులుగా తయారుచేయడం - ఇది సేవ, ఇంకే కష్టాన్ని ఇవ్వరు. అర్థం చేయించడం కూడా చాలా సహజము. కలియుగంలో ఉన్నదే తమోప్రధానమైనవారు. ఒకవేళ కలియుగం ఆయువును పెంచేస్తే ఇంకా తమోప్రధానులుగా అయిపోతారు.

ఇప్పుడు మనల్ని పుష్పాలుగా తయారుచేసే తండ్రి వచ్చారని మీకు తెలుసు. ముళ్ళగా తయారుచేయడం రావణుడి పని. పుష్పాలుగా తండ్రి తయారుచేస్తారు. ఎవరికైతే శివబాబా గుర్తుంటారో, వారికి తప్పకుండా స్వర్గం కూడా గుర్తుంటుంది. ప్రభాత వేళలో ర్యాలీ తీసినప్పుడు, అందులో కూడా చూపించండి - ప్రజాపిత బ్రహ్మాకుమార-కుమారీలమైన మేము భారత్ లో ఈ లక్ష్మీ-నారాయణుల రాజ్యాన్ని స్థాపన చేస్తున్నాము. బ్రాహ్మణులమైన మనము దేవతలుగా అవుతాము. దేవతల నుండి మళ్ళీ క్షత్రియులుగా, తర్వాత వైశ్యులుగా... ఇది పిల్లిమొగ్గలాట. ఎవరికైనా అర్థం చేయించడము చాలా సహజము. మనం బ్రాహ్మణులము. బ్రాహ్మణులకు పిలక ఉంటుంది. మనము 84 జన్మల చక్రాన్ని పూర్తి చేసాము అని మీరు కూడా భావిస్తారు. పిల్లలకు ఎంత మంచి జ్ఞానం లభిస్తుంది. మిగిలినదంతా భక్తి. జ్ఞానాన్ని ఒక్క తండ్రియే వినిపిస్తారు. సర్వుల సద్గతిదాత ఒక్క తండ్రే. పురుషోత్తమ సంగమయుగం కూడా ఒక్కటే. ఈ సమయంలో తండ్రి పిల్లలైన మిమ్మల్ని చదివిస్తారు. భక్తిలో మళ్ళీ స్మృతిచిహ్నం నడుస్తుంది. ఈ పురుషార్థం చేయడం ద్వారా మీరు ఈ వారసత్వాన్ని తీసుకోగలరు అని తండ్రి పిల్లలైన మీకు మార్గాన్ని తెలియజేశారు. ఈ చదువు చాలా సహజమైనది. ఇది నరుని నుండి నారాయణునిగా అయ్యే చదువు. దీనిని కథ అని అనడము తప్పు ఎందుకంటే కథలో లక్ష్యము-ఉద్దేశ్యము ఉండదు. చదువులో లక్ష్యము-ఉద్దేశ్యము ఉంటుంది. ఎవరు చదివిస్తారు? జ్ఞానసాగరుడు. తండ్రి అంటారు, నేను వచ్చి రత్నాలతో మీ జోలెను నింపుతాను. అనంతమైన తండ్రిని మీరు ఏం ప్రశ్నిస్తారు. ఈ సమయంలో అందరూ రాతిబుద్ధి కలవారిగా ఉన్నారు. రావణుడి గురించే తెలియదు. మీకు ఇప్పుడు ప్రశ్నించడానికి తెలివి లభిస్తుంది. మనుష్యులను అడగండి - అసలు రావణుడు ఎవరు? ఇతడి జన్మ ఎప్పుడు జరిగింది? ఎప్పటి నుండి కాలుస్తున్నారు? అనాది అని అంటారు. మీరు అనేక రకాలుగా ప్రశ్నలు అడుగవచ్చు. అది కూడా సమయం వచ్చినప్పుడే అడుగుతారు. ఎవ్వరూ జవాబివ్వలేకపోతారు. మీ ఆత్మ స్మృతియాత్రలో నిమగ్నమైపోతుంది. ఇప్పుడు స్వయాన్ని ప్రశ్నించుకోండి - నేను సతోప్రధానముగా అయ్యానా?

మనసు సాక్ష్యం చెప్తుంది. ఇప్పుడింకా కర్మాతీత అవస్థ తయారవ్వలేదు. అది తయారవ్వనున్నది. ఈ సమయంలో మీరు చాలా తక్కువమంది ఉన్నారు, అందుకే మీ మాటను ఎవరూ వినరు, అంతేకాక మీ విషయాలు అతీతమైనవి. మొట్టమొదట - తండ్రి సంగమయుగంలో వస్తారు అన్న విషయము చెప్పండి. ఎప్పుడైతే ఒక్కొక్క విషయాన్ని అర్థం చేసుకుంటూ ఉంటారో, అప్పుడే ముందుకు తీసుకువెళ్ళండి. చాలా ఓర్పుతో, ప్రేమగా అర్థం చేయించాలి - మీకు ఇద్దరు తండ్రులు ఉన్నారు, లౌకికము మరియు పారలౌకికము. ఎప్పుడైతే సతోప్రధానంగా అవుతారో, అప్పుడు పారలౌకిక తండ్రి నుండి అనంతమైన వారసత్వం లభిస్తుంది. తండ్రి గుర్తుంటే సంతోషపు పాదరసం పైకెక్కుతుంది. పిల్లలైన మీలో ఎన్నో గుణాలు నింపడం జరుగుతుంది. తండ్రి వచ్చి పిల్లలైన మీకు అర్హతలను నేర్పిస్తారు. ఆరోగ్యాన్ని-సంపదను కూడా ఇస్తారు, గుణాలను కూడా తీర్చిదిద్దుతారు. విద్యను కూడా ఇస్తారు. జైలు శిక్షల నుండి కూడా విడిపిస్తారు.

మీరు చాలా మంచి రీతిలో మినిస్టర్ మొదలైనవారికి కూడా అర్థం చేయించవచ్చు. ఎలా అర్థం చేయించాలంటే దానితో వారు కరిగిపోవాలి. మీ జ్ఞానము చాలా మధురమైనది. ప్రేమగా కూర్చొని విన్నట్లయితే ప్రేమ అశ్రువులు వస్తాయి. ఎల్లప్పుడూ - మేము సోదరునికి మార్గాన్ని తెలియజేస్తున్నాము అన్న దృష్టితోనే చూడండి. వారికి చెప్పండి, మేము శ్రీమతమనుసారంగా భారత్ కు సత్యమైన సేవను చేస్తున్నాము. భారత్ యొక్క సేవలోనే ధనాన్ని ఖర్చు చేస్తాము. బాబా అంటారు, ఢిల్లీలో సేవతో చుట్టుముట్టండి, విస్తరింపజేయండి. కానీ ఇప్పటివరకు ఇంకా ఎవ్వరికీ గురి తగలలేదు, గురి తగలాలంటే యోగబలం కావాలి. యోగబలముతో మీరు విశ్వానికి యజమానులుగా అవుతారు. దానితోపాటు జ్ఞానం కూడా ఉంది. యోగముతోనే మీరు ఎవరినైనా ఆకర్షించగలుగుతారు. ఇప్పుడు పిల్లలు భాషణ బాగా చేస్తారు కానీ యోగం యొక్క ఆకర్షణ తక్కువ ఉంది. ముఖ్యమైన విషయము యోగము. పిల్లలైన మీరు యోగముతో స్వయాన్ని పవిత్రంగా చేసుకుంటారు. కావున యోగబలం చాలా కావాలి. అది ఎంతో లోపిస్తుంది. లోలోపల సంతోషంలో నాట్యం చేయాలి, ఇది సంతోషపు నాట్యము. ఈ జ్ఞాన-యోగాలతో మీ లోపల నాట్యం జరుగుతుంది. తండ్రి స్మృతిలో ఉంటూ-ఉంటూ మీరు అశరీరిగా అయిపోతారు. జ్ఞానముతో అశరీరిగా అవ్వాలి, ఇందులో మాయమయ్యే విషయమేమీ లేదు, బుద్ధిలో జ్ఞానం ఉండాలి. ఇప్పుడు ఇంటికి వెళ్ళాలి, తర్వాత రాజ్యములోకి వస్తారు. తండ్రి వినాశనం మరియు స్థాపన యొక్క సాక్షాత్కారాలను కూడా చేయించారు. ఈ ప్రపంచమంతా కాలిపోయి ఉంది, మనం కొత్త ప్రపంచానికి యోగ్యులుగా అవుతున్నాము. ఇప్పుడు ఇంటికి వెళ్ళాలి, అందుకే శరీరము పట్ల కూడా ఎటువంటి మమకారం ఉండకూడదు. ఈ శరీరము నుండి, ప్రపంచము నుండి ఉపరామముగా ఉండాలి. కేవలం మీ ఇంటిని మరియు రాజధానిని స్మృతి చేయాలి. ఏ వస్తువు పట్ల ఆసక్తి ఉండకూడదు. వినాశనం కూడా కఠినంగా జరగనున్నది. ఎప్పుడైతే వినాశనం జరగడం మొదలవుతుందో, అప్పుడు మీకు సంతోషం కలుగుతుంది - ఇప్పుడిక మేము ట్రాన్స్ఫర్ అయిపోతున్నాము అని. పాత ప్రపంచానికి సంబంధించిన ఏ వస్తువు గుర్తుకొచ్చినా సరే ఫెయిల్. పిల్లల వద్ద అసలేమీ లేనే లేనప్పుడు ఇక ఏం గుర్తుకొస్తుంది? అనంతమైన ప్రపంచమంతటి నుండి మమకారం తొలగిపోవాలి, ఇందులో శ్రమ ఉంది. ఎప్పుడైతే దేహాభిమానం తెగిపోతుందో, అప్పుడే భాయి-భాయి (పరస్పరం సోదరులము) అనే పక్కా అవస్థ ఉండగలదు. దేహాభిమానములోకి రావడం వలన ఏదో ఒక నష్టం కలుగుతుంది. దేహీ-అభిమానులుగా అయినట్లయితే నష్టం కలుగదు. నేను సోదరుడిని చదివిస్తున్నాను, సోదరునితో మాట్లాడుతున్నాను, ఇది పక్కా అలవాటైపోవాలి. ఒకవేళ స్కాలర్షిప్ తీసుకోవాలంటే అంతటి పురుషార్థం చేయాలి. అర్థం చేయించేటప్పుడు కూడా మనమందరము పరస్పరం సోదరులము అన్నది గుర్తుండాలి. ఆత్మలందరూ ఒక్క తండ్రి పిల్లలు. సోదరులందరికీ తండ్రి వారసత్వంపై హక్కు ఉంది. సోదరి అన్న భానము కూడా రాకూడదు. దీనినే ఆత్మాభిమాని అని అంటారు. ఆత్మలకు ఈ శరీరాలు లభించాయి, అందులో కొందరికి పురుషుని పేరు, కొందరికి స్త్రీ పేరు వచ్చింది. వీటికి అతీతంగా ఉండేది ఆత్మ. బాబా ఏ మార్గాన్ని అయితే తెలియజేస్తున్నారో, అది తప్పకుండా సరైనది అని ఆలోచించాలి. ఈ అభ్యాసాన్ని చేసేందుకే పిల్లలు ఇక్కడకు వస్తారు. ట్రైయిన్ లో ఎవరికైనా బ్యాడ్జిపై అర్థం చేయించవచ్చు. మీకు ఎంతమంది తండ్రులు ఉన్నారు అని కూర్చుని ఒకరినొకరు ప్రశ్నించుకోండి, ఆ తర్వాత జవాబు చెప్పండి. ఇది ఇతరుల అటెన్షన్ ను ఆకర్షించేందుకు యుక్తి. ఆ తర్వాత చెప్పండి - మీకు ఇద్దరు తండ్రులు ఉన్నారు, మాకు ముగ్గురు ఉన్నారు, ఈ అలౌకిక తండ్రి ద్వారా మాకు వారసత్వం లభిస్తుంది. మీ వద్ద ఫస్ట్ క్లాస్ వస్తువు ఉంది. దీని వల్ల లాభమేమిటి అని ఎవరైనా అడిగితే వారికి చెప్పండి - అంధులకు చేతికర్రగా అయి మార్గాన్ని చూపించడం మా కర్తవ్యము. ఏ విధంగా నర్స్ సేవ చేస్తారో, అలా మీరు కూడా చేయండి. మీరు ఎంతోమంది ప్రజలను తయారుచేసుకోవాలి. ఉన్నత పదవిని పొందడానికి పురుషార్థం చేయాలి. మీరు అందరికీ ఎక్కే కళ యొక్క మార్గాన్ని తెలియజేస్తారు. ఒక్క తండ్రిని స్మృతి చేస్తూ ఉన్నా కూడా ఎంతో సంతోషం కలుగుతుంది మరియు వికర్మలు కూడా వినాశనమవుతాయి. తండ్రి నుండి వారసత్వాన్ని తీసుకోవడం చాలా

సహజము. కానీ చాలామంది పిల్లలు నిర్లక్ష్యం చేస్తారు. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. అంతిమ సమయంలో పాస్ అవ్వడానికి ఈ శరీరము మరియు ప్రపంచము నుండి ఉపరామముగా ఉండాలి, ఏ వస్తువు పట్ల ఆసక్తిని ఉంచుకోకూడదు. ఇప్పుడిక మేము ట్రాన్స్ఫర్ అయిపోతున్నాము అని బుద్ధిలో ఉండాలి.

2. ఎంతో ఓర్పుతో మరియు ప్రేమతో అందరికీ ఇద్దరు తండ్రుల పరిచయాన్ని ఇవ్వాలి. జ్ఞాన రత్నాలతో జోలెను నింపుకొని దానం చేయాలి. ముళ్ళను పుష్పాలుగా తయారుచేసే సేవను తప్పకుండా చేయాలి.

వరదానము:- తండ్రి మరియు సేవలో నిమగ్నమై ఉండే నిర్విఘ్న, నిరంతర సేవాధారి భవ

ఎక్కడైతే సేవ యొక్క ఉల్లాసం ఉంటుందో అక్కడ అనేక విషయాల నుండి సహజంగానే పక్కకు వెళ్ళిపోతారు. ఒక్క తండ్రిలో మరియు సేవలో నిమగ్నమై ఉన్నట్లయితే నిర్విఘ్నులుగా, నిరంతర సేవాధారులుగా, సహజంగా మాయాజీతులుగా అయిపోతారు. ఎప్పటికప్పుడు సేవ యొక్క రూపురేఖలు మారుతున్నాయి మరియు మారుతూ ఉంటాయి. ఇప్పుడు మీరు ఎక్కువగా చెప్పాల్సిన అవసరం ఉండదు. వారు స్వయమే అంటారు, ఇది శ్రేష్ఠ కార్యము కనుక మమ్మల్ని కూడా సహయోగులుగా చేసుకోండి అని. ఇది సమయం యొక్క సమీపతకు గుర్తు. కావున చాలా ఉల్లాస-ఉత్సాహాలతో సేవ చేస్తూ ముందుకు వెళ్తూ ఉండండి.

స్లోగన్:- సంపన్నత యొక్క స్థితిలో స్థితులై, ప్రకృతి యొక్క అలజడిని కదులుతున్న మేఘాల సమానంగా అనుభవం చేయండి.